కూటమి నేతలకు 'కిక్కు'

ప్రభుత్వం మారింది.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నూతన మద్యం పాలసీని తెచ్చారు. ఇటీవల మద్యం టెండర్లకు నోటిఫికేషన్ ఇచ్చి, లాటరీ ద్వారా ఎంపిక ప్రక్రియ సోమవారం పూర్తయ్యింది. అయితే వడ్డించేవాడు మనవాడైతే ఏ వరుసలో కూర్చున్నా.. మద్యం మన ముందుకొస్తుందన్నట్లు .. కూటమి నేతలకే లక్కు కిక్కు దక్కింది. మొదటి నుంచి చివరి వరకు నేతల బెదిరింపులు, వ్యాపారులు, నాయకుల సిండికేట్ల హవా కొనసాగింది. టీడీపీ అనుయాయులకే 80శాతం మద్యం దుకాణాలు వరించాయి. శనివారం నుంచి మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. ఇక ఊరూరా మద్యం ఏరులై పారనుంది.

– రాయదుర్గం:

టీడీపీ అనుయాయులకే 80 శాతం మద్యం దుకాణాలు

- 20 శాతం కూడా లాక్కునేలా కుట్రలు
- 37 షాపులకు 905 దరఖాస్తులు
- 868 మంది నుంచి రూ.1.73 కోట్లు కోల్పోయిన లైసెన్స్ ఫీజు
- ప్రభుత్వ ధర కాకుండా సిండికేట్లు చెప్పిందే రేటు
- ఇక ఊరురా ఏరులైపారనున్న మద్యం



రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 37 మద్యం దుకాణాల్లో 80 శాతం టీడీపీ అనుయాయులే దక్కించుకున్నారనే చర్చ సాగింది. మిగిలిన 20 శాతం దుకాణాలు కూడా సొంతం చేసుకునేలా పైరవీలు, బెదిరింపులకు తెగబడ్డారు. కళ్యాణదుర్గంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి దక్కిన షాపులో వాటాకోసం నేతల ఒత్తిడి చేసినట్లు తెలిసింది. ఓ హోటల్ నిర్వాహకుడికి దక్కిన షాపును కూడా లాక్కునేందుకు కుట్రలు మొదలయ్యాయి. అతడు కాస్త మొండికేయడంతో హోటల్‌పై మున్సిపల్ అధికారులతో వరుసగా దాడులు చేయించారు. గత టీడీపీ హయాంలో మద్యం షాపులన్నీ ఓ గొడుగు కిందకు తీసుకొచ్చి సిండికేట్‌గా నడిపిన కొందరు వ్యాపారులు.. కొత్త వ్యక్తులకు షాపుల దక్కడం కాస్త జీర్ణించుకోలేకపోతున్నట్లు సమాచారం. అనుకున్నది ఒక్కటైతే..అయింది మరొక్కటి అన్న చందంగా వారి తీరు మారింది. పరిస్థితి ఇలా అవుతుందని తెలిసి ఉంటే టెండర్లలో దరఖాస్తు చేసే వాళ్లం కాదని చాలా మంది విసిగించుకున్నారు. 37 దుకాణాలకు 905 మంది ఒక్కొక్కరు రూ.2 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. 868 మంది రూ.17.36 కోట్ల మేర లైసెన్స్ ఫీజు వదిలేయాల్సి వచ్చింది.

ఇక అంతా సిండికేటే..

గతంలో ప్రైవేట్ షాపుల్లో మద్యం విక్రయాలు సాగినప్పుడు జరిగిన సిండికేట్ వ్యవహారమే మళ్లీ తెరపైకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. దీని కోసం ఓ ప్రత్యేక సారా డిపో పేరుతో ఓ కార్యాలయం కూడా నిర్వహించారు. ప్రభుత్వ ధరలతో కాకుండా సిండికేట్ రేట్లతో మళ్లీ దోచుకుంటారని మందు బాబులు అంటున్నారు. ఎమ్మార్పీకే అమ్ముతారా? బాటిల్‌పై ధర పెంచి అమ్ముతారో వేచి చూడాల్సి ఉంది. ముఖ్య నేతలకు షాపుల్లో వాటాలా? లేక పర్సెంటేజీలా అన్న రీతిలో చర్చ సాగుతోంది.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో దరఖాస్తులు ఇలా...:

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని 10 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకు సుమారు 154 మంది దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మూడు షాపులకు 65 మంది, కళ్యాణదుర్గం రూరల్ పరిధిలో రెండు షాపులకు 21, బ్రహ్మసముద్రం మండలంలో ఒక దుకాణానికి 18 మంది, కంబదూరు మండలంలో ఒక షాపుకు 17 మంది, కుందుర్పి మండంలో రెండు దుకాణాలకు 22 మంది, శెట్టూరు మండలంలో ఒక దుకాణానికి 11 మంది దరఖాస్తు చేసుకున్నారు.అయితే అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కుటుంబ సభ్యుడు ఏకంగా నియోజకవర్గంలో 80 శాతం పైగా దరఖాస్తులను అనుచరుల పేరిట రుసుం చెల్లించి, టెండర్లు వేశాడు.

మద్యం షాపులు దక్కించుకున్న వారు ఇలా..

ఇదిలా ఉండగా కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో 126వ షాపును కొలకసూరు రజేష్‌బాబు, 127వ షాపు ఎన్. దినేష్ కుమార్ నాయుడు, 128వ షాపు కేతిరెడ్డి నీలకంఠ, కళ్యాణదుర్గం రూరల్‌లో 129వ షాపు చల్లా నరసింహులు, 130వ షాపు సన్నాపురెడ్డి సుజల, బ్రహ్మసముద్రంలో 131వ షాపు వై.పూల రమేష్‌బాబు, 133వ షాపు కంబదూరు మండలంలో ఊరువాకలి లక్ష్మణమూర్తి, కుందుర్పిలో 134వ షాపు తలారి నాగరాజు, 135వ షాపు బోయ ప్రతాప్, శెట్టూరులో 136వ షాపును గుజ్జల నగేష్ దక్కించుకున్నారు.

నేటి నుంచి తెరుచుకోనున్న షాపులు

లాటరీ ద్వారా మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులు షాపులు ఏర్పాటులో నిమగ్నమయ్యారు. శనివారం నుంచి అధికారికంగా దుకాణాలు తెరవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మద్యం రవాణా కోసం తగిన మొత్తం చెల్లించినట్టు వ్యాపారులు చెప్తున్నారు. అయితే పాత మద్యం సిసాలా? లేక కొత్త మద్యం బాటిళ్లు వస్తాయో వేచి చూడాల్సి ఉంది.

లాటరీ వరించింది వీరినే...

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కూడేరులో రెండు దుకాణాలకు సుబ్బర రవి, సోమశేఖర్, వజ్రకరూరులో ఎలుకమూర్తి రామాంజనేయులు, మాదిగ అశోక్‌కుమార్, ఉరవకొండ మండలంలో అంగదాల నాగభూషణ, కంద్యాల సూర్యనారాయణ, అంగదాల విజయలక్ష్మి, ముతులూరు ఎర్రిస్వామిరెడ్డి, నలబాల మహేష్, విడపకనల్లు మండలంలో బొమ్మయ్యగారి నాగరాజు, చెన్నకేశవులు, కణేకల్లు మండలంలో వడ్డే చంద్రశేఖర్, పీ మారుతీప్రసాద్, నాగరాజు, రమేష్‌బాబు, బొమ్మనహాళ్ మండలంలో గాజుల కుల్లాయిస్వామి, ఎరగుంట వెంకటేశులు, రాయదుర్గం పట్టణంలోని అగ్రహారం అశోక్, కే అనుప్రకాష్‌రెడ్డి, బీఎం శ్రీరామరెడ్డి, ఈ విజయకుమార్‌గౌడ్, బీఆర్ వేణుగోపాల్, రాయదుర్గం మండలం చాకలి వీరభద్ర, డి హీరేహాళ్ మండలం కురుబ శంకరప్ప, గుమ్మఘట్ట కే ప్రకాష్, కళ్యాణదుర్గం పట్టణం కీర్తిరెడ్డి నీలకంఠ, రాజేష్‌బాబు, దినేష్‌కుమార్, కళ్యాణదుర్గం మండలం చల్లా నరసింహులు, సన్నపురెడ్డి సుజల, బ్రహ్మసముద్రం మండలం రమేష్‌బాబు, బెళుగుప్ప మండలం వెలుపుల హనుమంతరెడ్డి, కంబదూరు మండలం ఊరువాకిలి లక్ష్మణమూర్తి, కుందుర్పి మండలం తలారి నాగరాజు, బోయ ప్రతాప్, శెట్టూరు మండలం గుజ్జల నగేష్‌లకు లాటరీ వరించింది.

ఊరూరా తెరుచుకోనున్న బెల్టుషాపులు,బార్లు..

మద్యం షాపులు దక్కించుకున్న వారి కనుసన్నల్లోనే ఊరూరా బెల్టుషాపులు, బార్లు వెలిసేలా కసరత్తు ప్రారంభమైంది. బెల్టు షాపుల కోసం నేతల చుట్టూ తెలుగు తమ్ముళ్లు ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకంటే తమకే దుకాణం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే అప్పుడే వేలాలు తెరపైకి వస్తున్నాయి. ఈ లెక్కన ఊరూర మద్యం ఏరులై పారనుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

జడివానకు కూలిపోయిన ఇళ్లు



కెంచంపల్లిలో కూలిపోయిన ఇల్లు

కుందుర్పి: మండలంలో వ్యాప్తంగా కురుస్తున్న జడివానకు ఏడు ఇళ్లు కూలిపోయినట్లు బాధితులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం తెలియజేశారు. కెంచంపల్లిలో- 2, ఎనుములొద్దిలో 1, బెస్తరపల్లిలో - 2, కరిగానిపల్లిలో-1, వడ్డేపాళ్యంలో -1 కూలిపోయినట్లు తెలియజేశారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులున్నట్లయితే సమాచారం అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

రాయితీతో పప్పుశనగ పంపిణీ

బొమ్మనహాళ్: ప్రభుత్వం 25 శాతం రాయితీతో అందించే పప్పుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సాయికుమార్ తెలిపారు. ఏఓ మాట్లాడుతూ బొమ్మనహాళ్ మండలానికి 500 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయించినట్లు తెలిపారు. 418 క్వింటాళ్లకు 403 మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. గోవిందవాడ, దర్గాహొన్నూరు, ఉంతకల్లు గ్రామాల్లో 270 మంది రైతులకు 300 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేసినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప

రాయదుర్గంటౌన్: పట్టణంలో ప్రజా సమస్యలను విభాగాల వారీగా అధికారులు, సిబ్బంది పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విభాగాల వారీగా ఇంజనీరింగ్, పారిశుధ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూము సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈలు నరసింహులు, ప్రతాప్, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

బెళుగుప్ప: మండలంలోని గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి, పీడీ తిమ్మరాజు తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో జీ మెహతాజ్, జె.తేజశ్రీ, బాలుర విభాగంలో పి.నూర్ మహమ్మద్ ప్రతిభ సాధించి, తెనాలిలో ఈనెల 26 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 హ్యాండ్ బాల్ బాలికల విభాగంలో ఎస్.సానియా, వై.వైష్ణవి జిల్లా స్థాయి ఉత్తమ ప్రతిభతో ఎన్‌టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్‌లో అండర్-19లో జి.కిరణ్‌కుమార్ కర్నూలులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ: భారీ వర్షాల నేపథ్యంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఉరవకొండ ఎంపీడీఓ రవిప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిలకు ఎంపీడీఓ, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి మెడికల్ కిట్లు అందించారు. ఏఓ శంకర్ పాల్గొన్నారు.

కంబదూరు: భారీ వర్షాలు కురవనున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాలకిషన్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగితే వెంటనే సెల్: 9493188848 సమాచారం అందించాలన్నారు.

కళ్యాణదుర్గంలో కంట్రోల్ రూం ఏర్పాటు

కళ్యాణదుర్గం: భారీ వర్షాల నేపథ్యంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ వినూత్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వరదల వల్ల ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే వెంటనే కంట్రోల్ రూం: 08497-220322 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

వజ్రకరూరు: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జరుట్లరాంపురంలో చిరుత సంచారంపై తహసీల్దార్ వివరాలు ఆరా తీశారు. ఫారెస్ట్ బీట్‌అధికారి సతీష్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



కమ్మూరులో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

కూడేరు: గొటుకూరు, కమ్మూరు, అరవకూరు పంచాయతీల్లో ఉపాధి నిధులు రూ.37 లక్షలతో 19 ప్రాంతాల్లో డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు ఏర్పా టు చేస్తున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించా రు. ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, వైస్ ఎంపీపీ దేవ, సర్పంచ్‌లు ఆశాలత, రంగారెడ్డి, రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్యా , పీఆర్ ఏఈ రమణయ్య, ఏపీఓ తులసీ ప్రసాద్, ఈఓఆర్డీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: పల్లెల్లో సీసీ రోడ్ల ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో పల్లెపండుగలో భాగంగా సీసీరోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఉపాధి ఏపీఓ సురేశ్, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బెళుగుప్ప: బెళుగుప్ప, తగ్గుపర్తి గ్రామ పంచాయతీల్లో సీసీరోడ్లు, హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలకు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, అధికారులు మంగళవారం భూమి పూజ చేశారు. వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. డివిజనల్ ఇంజనీర్ మహమ్మద్, గ్రామ సర్పంచ్ మౌనిక, ఏపీఓ సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఆహ్వానించకుండా..

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లి గ్రామంలో మంగళవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ సభ్యుడు నరసింహులు, వార్డు మెంబర్లను కార్యక్రమం జరగడానికి గంట ముందు సమాచారం అందించారు. గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములను చేయాల్సిన అధికారులు.. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇలా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

పల్లెపండుగ ఇదేనా?

కుందుర్పి: పల్లె పండుగ అంటే ఇదేనా? అని వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దప్పయ్య,మాజీ జెడ్పీటీసీ సభ్యులు రాజగోపాల్, ఎలక్ట్రీషియన్ నాగేంద్ర ప్రశ్నిస్తున్నారు. మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల రోడ్లు చిన్నపాటి వర్షానికే ఛిద్రమై మోకాలిలోతు గుంతలతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. మరోవైపు రోడ్లకు ఒక గంప కూడా మట్టి వేయకుండానే ప్రభుత్వం మాత్రం పల్లె పండుగ పేరుతో ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తోందన్నారు. జంబుగుంపల-బెస్తరపల్లి, అల్లాపురం- ఏళ్లచింత, శీగలపల్లి - కొల్లారటి తదితర గ్రామాల రోడ్లు దెబ్బతినడంతో రాకపోకలు స్తంభించాయన్నారు.



కెంచంపల్లిలో ఛిద్రమైన రోడ్డు

చేతులు శుభ్రతతో వ్యాధులు దూరం

బొమ్మనహాళ్: చేతులను శుభ్రం చేసుకోకపోతే వ్యాధులు వస్తాయని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవగిరి క్రాస్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: మండలంలోని అవులదట్ల టీడీపీ సర్పంచ్ వన్నూర్‌స్వామి, అతని కుమారులు సుబ్బు, రమేష్, సోదరుడి కుమారులు ప్రతాప్, శాంతమూర్తితో పాటు అదే గ్రామానికి చెందిన మత్తయ్యపై అర్బన్ పీఎస్‌లో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, కణేకల్లు మాజీ ఎంపీపీ ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, వివిధ మండలాల నాయకులతో కలసి జెడ్పీటీసీ, పార్టీ మండల కన్వీనర్ హొన్నే మల్లికార్జున మంగళవారం ఫిర్యాదు చేశారు. దాడి ఘటనపై సీఐ జయానాయక్‌కు వివరించారు. అకారణంగా చుట్టుముట్టి భౌతికదాడి చేశారని తెలిపారు. మొక్కజొన్నల వ్యాపారం కోసం ద్విచక్ర వాహనంపై గ్రామదట్ల రఘునాథరెడ్డితో కలిసి వెళ్తుంటే అడ్డగించి, కర్రలు, మారణాయుధాలతో వెంబడించి బొమ్మక్కపల్లి దాటగానే ఈ దారుణానికి ఒడిగట్టారన్నారు. దాడిని అడ్డుకున్న రఘునాథరెడ్డిని కూడా చంపేస్తామని బెదిరించడం దారుణమన్నారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు వచ్చి దాడిని అడ్డుకుని, ప్రాణాలు రక్షించారని, బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై హత్యాయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విచారించి తప్పక న్యాయం చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకొని, భక్తిమార్గంలో నడవాలని మఠాల పీఠాధిపతులు తెలియజేశారు. మంగళవారం మండలంలోని గంజికుంటలోని ఉమామహేశ్వర గురు పీఠం(శ్రీప్రణవానంద ఆశ్రమం)లో ఆశ్రమ ధర్మకర్త మఠం ఉమాదేవి ఆధ్వర్యంలో శివస్వరూపానందగిరి గురువర స్వాముల వారి 27వ పుణ్యారాధన మహోత్సవం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు ప్రణవానందగిరి గురుస్వామి(ఉమామహేశ్వర గురుపీఠం, లత్తవరం), శ్రీగురుచరణానందగిరి మాతాజీ (శ్రీగు రుశంకరానందగిరి సేవాశ్రమం కొక్కర చేడు), శ్రీగురుసే వా నందస్వామి (కమలపాడు), శ్రీఅభినవ శంకరానందస్వామి (శ్రీశివరామానంద ఆశ్ర మం, చాగలమర్రి), శ్రీశివానంద మాతాజీ (అనాధీశ్వర ఆశ్రమం, విశాఖపట్టణం) హాజరయ్యారు. ఉదయం పరమేష్టిగురు శ్రీప్రణవానంద సద్గురువుల పూజ, బ్రహ్మీ ముహూర్తాన సుప్రభాత సేవ, చంద్రమౌళీశ్వర పూజ, సద్గురువుల సమాధులకు రుద్రాభిషేకం, శివ సహస్ర నామార్చన, శ్రీగురు పూజ, భగవద్గీత పారాయణం, శ్రీగురు పాదుకా స్తవం, మంత్రపుష్పం, మంగళం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుణ్యారాధన మహోత్సవ వేడుకలు బుధ,గురువారాలు కూడా జరగనున్నట్లు ఆశ్రమ ధర్మకర్త ఉమాదేవి తెలిపారు.



పుణ్యారాధనలో మాట్లాడుతున్న పీఠాధిపతులు

సంక్షిప్త సమాచారం

బ్యాంక్ రుణాలు, చెల్లింపులపై ఆడిట్

కూడేరు: కూడేరులోని స్టేట్ బ్యాంక్‌లో బంగారు రుణాలు, వ్యవసాయ, ఇతర రుణాలు, వాటి చెల్లింపులు, ఇతర బ్యాంక్ లావాదేవీలపై మంగళవారం ఆడిట్ నిర్వహించారు. కేరళా నుంచి వచ్చిన ఆడిట్ అధికారి ఏడీ సునీల్ బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన అన్ని రికార్డులు, ఓచర్లను పరిశీలించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సురేంద్ర బాబు, ఫీల్డ్ ఆఫీసర్ మురళీ కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలి

గుమ్మఘట్ట: ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో బేటీ బజావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. గుడ్‌టచ్ , బ్యాడ్ టచ్‌ల గురించి విద్యార్థినులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఏఎన్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

వజ్రకరూరు: దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి ఏపీజే అబ్దుల్ కలాం అని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వర్ణలత, విశ్రాంత ఎంపీహెచ్ఈఓ పట్టా ఖాజాపీరా, బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత బెంజిమెన్, భారతరత్న జాతీయ అవార్డు గ్రహీత మల్లికార్జున, ఉపాధ్యాయులు నాగేష్, శ్రీహరి, కృష్ణానాయక్, బాషా, బ్రహ్మయ్య, సుధాకర్, ప్రభావతి, పీడీలు శ్రీనివాసులు, రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వసూలుపై దృష్టి పెట్టండి

వజ్రకరూరు: బకాయిల వసూలుపై దృష్టి పెట్టి రికవరీ చేయాలని వెలుగు ఏపీఎం ఎస్.లలిత తెలిపారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వీఓఏ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామాలవారీగా రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు వెంకటేశులు, నారాయణస్వామి, రామాంజనమ్మ, యేశోభ, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈ, ఏఈ బాధ్యతల స్వీకరణ

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘం మున్సిపల్ డీఈ, ఏఈలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు కార్పొరేషన్‌లో డీఈగా పని చేస్తున్న రవిప్రకాష్‌నాయుడు ఇక్కడికి బదిలీ కాగా, ధర్మవరంలో ఏఈగా పని చేస్తున్న ప్రతాప్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డిని కలిసి జాయినింగ్ ఆర్డర్ ఇచ్చారు. రెండు ఏఈ పోస్టులకు గాను ఇది వరకే గూడూరు నుంచి ఏఈ నరసింహులు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

ఆర్ఐగా నాగరాజు శేఖర్

కంబదూరు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు శేఖర్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఆర్ఐగా పని చేస్తున్న కిరణ్‌కుమార్ కొత్తచెరువుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కుందుర్పి నుంచి నాగరాజు శేఖర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

సచివాలయం తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ రామచంద్ర మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రంగనాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కణేకల్లు: అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని హనకనహాళ్‌లో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. కణేకల్లు ఎస్ఐ నాగమధు, డి.హిరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది పాత కేసుల్లో ఉన్న నేరస్తుల ఇళ్లు, అక్రమ మద్యం విక్రయదారుల ఇళ్లను సోదా చేశారు. అనంతరం శ్రీరామాలయం వద్ద ప్రజలనుద్దేశించి రూరల్ సీఐ మాట్లాడారు.

దీపావళికి మైసూరు– విజయపుర స్పెషల్ రైలు

రాయదుర్గంటౌన్: దీపావళి పండుగను పురస్కరించుకుని బెంగళూరు, రాయదుర్గం మీదుగా మైసూరు– విజయపుర స్పెషల్ రైలు నడపనున్నట్లు సౌత్ వెస్ట్రన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మంజునాథ కనమడి తెలియజేశారు. అక్టోబర్ 30, నవంబర్ 2 తేదీల్లో మైసూరు నుంచి విజయపురకు, అక్టోబర్ 31, నవంబర్ 3 తేదీల్లో విజయపుర నుంచి మైసూరుకు స్పెషల్ రైలు నడుస్తుందన్నారు. అక్టోబర్ 30, నవంబర్ 2 తేదీల్లో మైసూరులో సాయంత్రం 6 గంటలకు బయల్దేరి బెంగళూరు, అర్సికెర, చిక్‌జాజర్, చిత్రదుర్గ మీదుగా రాయదుర్గానికి తెల్లవారు జామున 4.30 గంటలకు చేరుకుంటుందన్నారు. బళ్లారి కంటోన్మెంట్, హొస్పేట్, ఆల్మట్టి మీదుగా విజయపురకు మరొనటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. అలాగే అక్టోబర్ 31, నవంబర్ 3 తేదీల్లో విజయపురం నుంచి సాయంత్రం 7 గంటలకు బయల్దేరి రాయదుర్గానికి తెల్లవారుజామున 2.28 గంటలకు చేరుకొని చిత్రదుర్గం, అర్సికెర, బెంగళూరు మీదుగా మరుసటి రోజు మధ్యాహ్నం 2.20 గంటలకు మైసూరు చేరుకుంటుందన్నారు. దీపావళి పండుగ స్పెషల్ రైలును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగు,సాగునీటి సమస్యలు పరిష్కరించాలి

బ్రహ్మసముద్రం: జిల్లా వ్యాప్తంగా జల వనరుల అభివృద్ధి పనులను పూర్తి చేసి, తాగు, సాగునీరు అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో బస్సు యాత్రలో భాగంగా సీపీఎం నాయకులు భైరవానితిప్ప ప్రాజెక్ట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్ర, బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్‌ప్రసాద్, చంద్రశేఖర్, నాగమణి, కృష్ణమూర్తి, రంగారెడ్డి, ప్రజానాట్య మండలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డ్‌కు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డ్ గాయపడ్డాడు. మంగళవారం పట్టణంలోని టీ సర్కిల్‌లో ట్రాఫిక్ నియంత్రిస్తున్న హోంగార్డ్ శ్రీనివాసులును వెనుక నుంచి ఆర్టీసీ బస్సుఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో హోంగార్డు కుడికాలు విరిగింది. వెంటనే స్థానికులు అతన్ని సీహెచ్‌సీకి తరలించారు. పట్టణ పోలీసులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంతో వృద్ధుడికి తీవ్ర గాయాలు

కూడేరు: ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో కూడేరుకు చెందిన వెంకటరమణశెట్టి అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. వెంకటరమణ శెట్టి కూడేరు బస్టాండ్‌లో కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం దుకాణానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి దాటుతుండగా అనంతపురానికి చెందిన అమరేష్, అనిల్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఆవు అడ్డు రావడంతో అదుపు తప్పి వెంకటరమణ శెట్టిని ఢీకొట్టారు. దీంతో ముగ్గురూ కిందపడ్డారు. వృద్ధుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా మారెమ్మ గ్రామోత్సవం

కుందుర్పి: మండలంలోని కలిగొలిమిలో మంగళవారం మారెమ్మ ఉత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామంలో ఇటీవల కాలంలో విషజ్వరాలు వస్తుండడంతో గ్రామస్తులు కొండ్లో మారెమ్మను గ్రామంలోకి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు, గ్రామ శాంతి చేశారు.

నేడు మాజీ ఎంపీ రంగయ్య పర్యటన

శెట్టూరు: మండలంలోని మాలేపల్లిలో మాజీ ఎంపీ తలారి రంగయ్య బుధవారం పర్యటించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ మంజునాథ ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా మహబూబ్‌సుబహాని ఉరుసు

ఉరవకొండ: స్థానిక కామన్నకట్ట, డ్రైవర్స్‌కాలనీల్లో ఉన్న మహబూబ్‌సుబహానీ దర్గా జెండా, ఉరుసు ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. డ్రైవర్స్‌కాలనీ, కామన్నకట్ట వద్ద ఉన్న జెండా కట్టల మీదుగా జెండాను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. యువకులు ప్రదర్శించిన పవిత్ర మక్కా, మదీనా ప్రతిరూపాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మహ్మద్ ప్రవక్త కేశఖండాన్ని భక్తులు తిలకించారు. మహబూబ్‌సుబహానీ జెండా కట్ట కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కళ్యాణదుర్గం: పట్టణంలో మహబూబ్ సుబానీ గంధం వేడుకలను ముస్లింలు వైభవంగా నిర్వహించారు. అనంతపురం రోడ్డులోని జెండా కట్ట వద్ద సోమవారం రాత్రి జెండా కట్టను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం హజరత్ మహబూబ్ సుబానీ గంధం వేడుకలను జెండా కట్ట కమిటీ సభ్యులు ఘనంగా చేపట్టారు. అనంతరం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో గంధం ఊరేగింపు నిర్వహించారు. ప్రజల సంక్షేమం కోసం ఫాతియా ఖానీ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం జెండా కట్ట వద్ద అన్నదానం చేశారు.



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ముస్లింలు

అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడొద్దు

కూడేరు: పంటల సాగులో అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడొద్దని అనంతపురం డివిజన్ ఏడీఏ రవి రైతులకు సూచించారు. మంగళవారం ఉదిరిపికొండ వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏడీ రవి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. తద్వారా ఆదాయాన్ని పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, ఏఈఓ శైలజ, కార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నిర్మల, వీఏఏ జయప్రకాష్, పట్టు శాఖ టీఏ శ్రీనివాసులు, వీహెచ్ఏ రాఘవ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది హరివల్లభ్, కుళ్లాయప్ప, నరసింహులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి '

కణేకల్లు: యాజమాన్య పద్ధతులు పాటించి మేలైన దిగుబడి సాధించాలని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, కణేకల్లు ఏఓ శ్రవణ్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారంమండలంలోని కె.కొత్తపల్లి గ్రామంలో 'పొలంబడి' కార్యక్రమం జరిగింది. ఏడీఏ, ఏఓలు వేరుశనగ పంట సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.



కె.కొత్తపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్